రహదారిపై వారసంత..!

- ట్రాఫిక్ సమస్యతో ప్రజల ఇబ్బందులు
- నత్తనడకన సాగుతున్న సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు


అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై నిర్వహిస్తున్న వారసంత

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం, గురువారం రెండు రోజులు వారసంతలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని బస్టాండు వద్ద ఆదివారం, ప్రధాన రహదారిపై గురువారం నిర్వహిస్తుండగా, రెండు ప్రదేశాల్లో రాకపోకలకు ప్రజలు నానా అవస్థలకు గురవుతున్నారు. కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. సమీకృత మార్కెట్ భవనం నిర్మాణం కోసం టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రెండు కోట్లు, పట్టణ ప్రగతి నిధులు రూ. కోటి తొంభై లక్షల నిధులు మంజూరు చేశారు. గత సంవత్సరం ఆగస్టులో అధికారులు, ప్రజాప్రతినిధులు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కానీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకొని, పనులు వేగవంతం చేసి ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌ను 'సాక్షి' వివరణ కోరగా, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం నిర్మాణ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. గడువులోపు పూర్తి కాలేదని, పనుల్లో కొంచెం ఆలస్యమైనట్లు తెలిపారు. పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తయ్యేలా చూస్తామన్నారు.


నిర్మాణ దశలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం

క్లుప్తంగా

మదనం పోచమ్మ హుండీ ఆదాయం రూ.5.12లక్షలు


హుండీ లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

చెన్నూర్: పట్టణంలోని మదనంపోచమ్మ ఆలయంలో మంగళవారం హుండీ ద్వారా భక్తులు సమర్పించుకున్న కానుకలను దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు, సిబ్బంది లెక్కించారు. హుండీ ఆదాయం రూ. 5.12,735, మిశ్రమ వెండి 330గ్రాములు, మిశ్రమ బంగారం 13గ్రాములు వచ్చినట్లు ఆలయ ఈవో ఎం.రవి తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 17వ వార్డులో రూ.48లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు మంగళవారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు భూమిపూజ చేసి ప్రారంభించారు. అనంతరం గోపాల్‌వాడలోని హనుమాన్ టెంపుల్ ఎదురుగా రూ.2.5లక్షల నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మామిడిశెట్టి వసుంధర, వార్డు కౌన్సిలర్లు పూదరి సునిత, నల్ల శంకర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పాతమంచిర్యాల: బీసీల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హంసరాజ్‌గంగారాంకు బహిరంగ లేఖ రాశారు. బీసీల సామాజిక భద్రత కోసం బీసీ యాక్ట్‌ను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణ్, గజెల్లి వెంకటయ్య, రాసమల్ల కుమార్, ఆరేందుల రాజేశం, కీర్తి భిక్షపతి, పల్లికొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మేరు కులస్తులను ఆదుకోవాలి


సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షుడు చందర్

భీమారం: మండలకేంద్రంలో మేరు సంఘం కులస్తుల సమావేశం నిర్వహించగా, ముఖ్య అతిథిగా మేరు సంఘం జిల్లా అధ్యక్షుడు గట్ల చందర్ హాజరై మాట్లాడారు. మేరు కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెడీమేడ్ దుస్తులు వచ్చినప్పటి నుంచి దర్జీలకు పని కరువైందని, టైలరింగ్ పనినే నమ్ముకున్న వారు నానా అవస్థలు పడుతున్నారని వాపోయారు. ప్రభుత్వం మేరు కులస్తులను ఆదుకోవాలని కోరారు. కులస్తులను చైతన్య పరిచేందుకు మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతరం భీమారం మండల కమిటీని ఎన్నుకోగా అధ్యక్షుడిగా కాటారపు హరిబాపు, ప్రధాన కార్యదర్శిగా రాపర్తి దామోదర్, గౌరవ అధ్యక్షుడిగా రామగిరి శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పెండ్యాల నరేందర్, రాపర్తి ఆనంద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

దండేపల్లి: మండలంలోని గూడెంకు చెందిన బీఆర్ఎస్ మండల యూత్ ఉపాధ్యక్షుడు దమ్మ సునీల్ మంగళవారం బీజేపీలో చేరారు. ఆయనకు పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, నాయకులు గుండా ప్రభాకర్, దమ్మని సత్తయ్య, గిరిధర్, గుండా రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



చెన్నూర్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంపై చెన్నూర్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి ఆర్టీసీ కార్మికులు, బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, మార్కెట్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, కౌన్సిలర్లు అనిల్, శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు మేడ సురేశ్‌రెడ్డి, శంకర్, రాంమోహన్, సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌పై సమావేశం


మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్

బెల్లంపల్లి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌పై మంగళవారం బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో అసెంబ్లీ నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో భాగంగా కొత్తగా ప్రతిపాదనలు వచ్చిన పోలింగ్ కేంద్రాల గురించి వివరించారు. బెల్లంపల్లి మండలంలో లింగాపూర్, దుగినేపల్లి గ్రామాల్లో, కాసిపేట మండలం వరిపేట గ్రామంలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నట్లు రాజకీయ పక్షాల నాయకులకు వివరించారు. మరికొన్ని చోట్ల పోలింగ్ కేంద్రాలను స్థానచలనం చేయనున్నట్లు తెలపగా రాజకీయ పక్షాల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదు. కొన్ని నెలల వ్యవధిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరపడానికి రాజకీయ పక్షాలు సంపూర్ణంగా సహకరించాలని అదనపు కలెక్టర్ కోరారు. సమావేశంలో తహసీల్దార్ మధుసూదన్, బీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ, ఎంఐఎం, ఎన్‌సీపీ, ఎం సీపీఐ(యూ) నాయకులు పాల్గొన్నారు.

'నేరాల నియంత్రణకు కమ్యూనిటీ కాంటాక్ట్'


దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఏసీపీ

వేమనపల్లి: నేరాల నియంత్రణకే గ్రామాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు జైపూర్ ఏసీపీ మోహన్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం రాజారాం గ్రామంలో పోలీసులు మీ కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని యువతకు అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ గ్రామాభివృద్ధికి పాటుపడాలని కోరారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు, యువకులకు వాలీబాల్ కిట్లు అందజేశారు. 12మోటారు సైకిళ్లు, ఒక టాటా ఏసీ వాహనం సీజ్ చేశారు. ప్రాణహిత ఫెర్రి పాయింట్లను పరిశీలించారు. ఆయన వెంట చెన్నూర్‌రూరల్ సీఐ విద్యాసాగర్, నీల్వాయి ఎస్సై సుబ్బారావు, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు


కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నెన్నెల: మండలంలోని కుశ్నపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఐ డ్రాప్స్, మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి లక్ష్మణ్ తెలిపారు. పాఠశాలలో 108 మంది విద్యార్థులు ఉండగా 70 మందికి కళ్లకలక రావడంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి చుక్కల మందు వేసినట్లు ఆయన చెప్పారు. జాగ్రత్తల గురించి విద్యార్థులు, ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు ఇందిరా, పద్మ, హెల్త్ అసిస్టెంట్ ప్రభాకర్, రాజ్‌కుమార్, పాఠశాల వార్డెన్ లచ్చన్న పాల్గొన్నారు.

జన్నారం: మండల కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కళ్లకలక సోకుతున్నందునా 170మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 20మంది విద్యార్థులకు కళ్లకలక సోకినట్లు గుర్తించినట్లు వైద్యురాలు గంగాదేవి తెలిపారు. వారికి ఐ డ్రాప్స్ వేసి, మందులు అందజేశారు. హెల్త్ సూపర్‌వైజర్ రాంబాబు, సీహెచ్‌వో రమేశ్, హెచ్ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కోటపల్లి: మల్లంపేట ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో కళ్లకలకపై హెల్త్ అసిస్టెంట్ శ్రీనాథ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం శంకర్, బాపు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం


లక్సెట్టిపేట: ప్రాముఖ్యతను వివరిస్తున్న సూపర్‌వైజర్


చిన్నారుల బరువు చూస్తున్న సూపర్‌వైజర్ మమత

తాండూర్: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని తాండూర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ముర్రుపాల ప్రాధాన్యత, పోషకాలు, బిడ్డల ఆరోగ్యం తదితర అంశాలపై తల్లులకు అవగాహన కల్పించారు. పుట్టిన శిశువుకు వెంటనే తల్లులు ముర్రుపాలు విధిగా తాగించాలన్నారు. బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పిల్లల బరువును చూశారు. అంగన్‌వాడీ కార్యకర్త సుజాత, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: తల్లిపాలే బిడ్డకు శ్రేయశ్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీపవాహిని అన్నారు. పట్టణంలోని 11వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సర్వీన్ సుల్తానా, అంగన్‌వాడీ టీచర్ సౌజన్య, ఆయాలు పాల్గొన్నారు.

జైపూర్: మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సరిత, ఏఎన్ఎం మల్లీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

చెన్నూర్: వర్షాలతో దోమలు వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని, దోమలు ఇంట్లోకి రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ గంగాధర్ అన్నారు. సీజనల్ వ్యాధులపై మున్సిపాలిటీ పరిధిలోని 11, 14వార్డులలో అవగాహన కల్పిస్తూ, బ్లీచింగ్, ఫాగింగ్, హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. కౌన్సిలర్లు శ్రావంతి, స్వర్ణలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

వేమనపల్లి: పోడు రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ గొడవలకు కారణమవుతున్న బీట్ అధికారిని ఉద్యోగం నుంచి తొలగించాలని ప్రగతి శీల యువజన సంఘం రాష్ట్ర కమిటీ నాయకుడు కుర్మ మనోహర్ అన్నారు. వేమనపల్లి, కన్నెపల్లి మండలాల పరిధిలోని మెట్‌పల్లి, జక్కపల్లి, నాగారాం, లింగాల ఫారెస్ట్ బీట్‌లలో పోడు పత్రాలు వస్తాయని రైతులను మభ్యపెడుతూ భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి బీట్ అధికారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా ఆటో కార్మిక దినోత్సవం


జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో...

తాండూర్/చెన్నూర్/జన్నారం/బెల్లంపల్లి/మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో, పలు మండల కేంద్రాల్లో ప్రపంచ ఆటో కార్మిక దినోత్సవాన్ని మంగళవారం ఆటోఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీనియర్ ఆటో డ్రైవర్లను శాలువాలతో సన్మానించారు. కేక్ కట్ చేసి, మిఠాయిలలు పంపిణీ చేశారు. రూ. వెయ్యి కోట్లతో ఆటో కార్పొరేషన్ ఆటో కార్మిక సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని, ఆటో కొనుగోలు కోసం వడ్డీ లేని రుణాలు ఇచ్చి, ప్రమాదంలో మరణించిన ఆటో కార్మిక కుటుంబానికి రూ.10లక్షలు ఇచ్చేలా ప్రభుత్వమే ఇన్సూరెన్స్ చేయించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్, యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు సుద్దాల రాజు, పట్టణ కార్యదర్శి కోలా రాజాగౌడ్, ముఖ్య సలహాదారు నరెడ్ల శ్రీనివాస్, కోకుల చంద్రయ్య, బదావత్ ప్రకాశ్‌నాయక్, తాండూర్‌లో ఆటో డ్రైవర్స్ సంఘం అధ్యక్షుడు హబీబ్ పాషా, ఉపాధ్యక్షుడు చాంద్ పాషా, కార్యదర్శి శంకర్, సలహాదారుడు సాగర్, చెన్నూర్‌లో ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎదుల లస్మయ్య, ఉపాధ్యక్షుడు పున్నం సంతోశ్, నాయకులు గర్రెపల్లి శ్రీనివాస్, గాదె రాజు, తిరుపతి, జన్నారంలో ఆటో యూనియన్ నాయకులు రత్నం మాణిక్యం, సతీశ్, నర్సింహులు, గంగన్న, రాజేందర్, బెల్లంపల్లిలో ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం


ఉద్యోగికి ప్రథమ చికిత్స పుస్తకాన్ని అందిస్తున్న జీఎం

నస్పూర్: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు ప్రథమ చికిత్సపై అవగాహన ఎంతో అవసరమని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవ రెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలోని వృత్తి శిక్షణా కేంద్రంలో మంగళవారం మహిళా ఉద్యోగులకు ప్రథమ చికిత్సపై శిక్షణా తరగతులను జీఎం ప్రారంభించారు. అనంతరం ప్రథమ చికిత్సకు సంబంధించిన పుస్తకాలను ఉద్యోగులకు అందించారు. కార్యక్రమంలో డీవైసీఎంఓ డాక్టర్ రమేశ్ బాబు, వృత్తి శిక్షణ కేంద్రం ఎస్ఓఎమ్ కల్లూరి వెంకటరమణ పాల్గొన్నారు.

సన్మానం

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్‌పి 3, ఎస్ఆర్‌పి 3ఏ గని సంక్షేమ అధికారిగా పని చేస్తున్న ఠాకూర్‌మోహన్ సింగ్ ఎస్‌టీపీపీకి బదిలీపై వెళ్తున్న సందర్భంగా మంగళవారం గని అధికారులు, సిబ్బంది ఆయనను సన్మానించారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ సురేందర్‌రెడ్డి, గని ఫిట్‌సెక్రటరీ గోపాల్ పాల్గొన్నారు.

'నిర్లక్ష్య వైఖరి సరికాదు'

నస్పూర్: శ్రీరాంపూర్ డివిజన్‌లో పనిచేస్తున్న ఐటీ అధికారుల నిర్లక్ష్య వైఖరి సరైనది కాదు అని శ్రీరాంపూర్ ఏరియా ఉప ప్రధాన కార్యదర్శి ఎస్‌కే బాజిసైదా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త కంప్యూటర్లను ట్రైనింగ్ కోసం వచ్చిన పాలిటెక్నిక్ విద్యార్థులకు కేటాయించడం సరికాదని సూచించారు. ఈ విషయమై జీఎం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

■ బొగ్గుబాయి వార్తలు

అడిషనల్ కలెక్టర్‌ను కలిసిన జీఎం



మందమర్రిరూరల్: జిల్లా అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించిన సబావత్ మోతీలాల్‌ను మంగళవారం మందమర్రి ఏరియా జీఎం మోహన్‌రెడ్డి కలిసి బొకే అందించి అభినందనలు తెలిపారు. ఏరియాలోని కేకే ఓసీ విస్తరణలో భాగంగా భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించిన సమస్యలను వివరించగా సానుకూలంగా స్పందించినట్లు జీఎం తెలిపారు. జీఎం వెంట ఎస్టేట్స్ ఆఫీసర్ కుమారస్వామి, అధికారి వెంకట్‌రెడ్డి ఉన్నారు.

సభ్యత్వం తీసుకోవాలి

పాతమంచిర్యాల: ప్లంబర్ వృత్తి పనులు చేసేవారు ప్లంబర్ అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకుని పనులు చేయాలని జిల్లా ప్లంబర్ అసోసియేషన్ అధ్యక్షుడు పొట్టాల మల్లేష్ అన్నారు. సభ్యత్వం లేకుండా పనులు చేసేవారిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తప్పవు

మంచిర్యాలఅర్బన్: నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు నడిపితే చర్యలు తప్పవని ఎంఈవో పోచయ్య అన్నారు. మంచిర్యాలలో అనుమతి లేకుండా ప్రైమరీ స్కూల్ నిర్వహిస్తున్నారని విద్యార్థి సంఘాల ఫిర్యాదు మేరకు మంగళవారం తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న ప్రైమరీ స్కూల్ పిల్లలను ఇంటికి పంపించారు. అనుమతి తీసుకున్న తర్వాత ప్రైమరీ తరగతులు కొనసాగించాలని యాజమాన్యానికి సూచించారు.

సత్తయ్య సేవలు చిరస్మరణీయం

దండేపల్లి: మాజీ మండలపరిషత్ ఉపాధ్యక్షుడు, రైతుసేవా సంఘం మాజీ అధ్యక్షుడు గుర్రం సత్తయ్య సేవలు చిరస్మరణీయం అని రైతుసేవా సంఘం నాయకులు పేర్కొన్నారు. దండేపల్లికి చెందిన సత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, మంగళవారం రైతుసేవా సంఘం వద్ద సంఘ నాయకులు ఆయనకు నివాళులర్పించారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

కోటపల్లి: ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీవో భాస్కర్ కార్యదర్శులను, ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్, కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీవో అక్తర్, ఈసీ నాగేందర్, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నాయకపు గూడలో వైద్యశిబిరం

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని నాయకపుగూడలో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందించారు.

సంక్షిప్త వార్తలు

వంతెనకు మరమ్మతులు

నెన్నెల: మండలంలోని గుండ్లసోమారం వంతెన శిథిలావస్థకు చేరింది. నాలుగు రోజుల క్రితం బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య వంతెనను పరిశీలించి తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.2లక్షలు మంజూరు చేశారు. వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు మంగళవారం బీఆర్ఎస్ నాయకులు సింగతి రాంచందర్, ప్రతాప్‌రెడ్డి, సాగర్‌గౌడ్, కున్సోతు నారాయణ, జాడి నారాయణ జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో వంతెనకు మరమ్మతు పనులు చేయించారు.

తలసేమియా వ్యాధిగ్రస్తులకు చేయూత

మంచిర్యాలటౌన్: స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్లడ్‌బ్యాంకులో తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తుల కోసం మంగళవారం రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు వి.మధుసూదన్ రెడ్డి రూ.11వేల ఆర్థిక సాయం అందించారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/దండేపల్లి: : గ్రామ పంచాయతీ సమస్యలపై జిల్లా వ్యాప్తంగా మల్టీపర్పస్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 27వ రోజుకు చేరింది. భీమిని, కన్నెపల్లి మండలాలకు చెందిన కార్మికులు దీక్ష విరమించినట్లు ప్రకటించగా వారికి అవగాహన కల్పించి సమ్మె కొనసాగించేలా ఒప్పించినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీ తెలిపారు.

'మంత్రి దయాకర్‌రావు క్షమాపణ చెప్పాలి'

మంచిర్యాలటౌన్: పెయింటింగ్ చిత్రకారులను అవహేళనగా, వారి మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలంగాణ పెయింటింగ్ చిత్రకారుల సంక్షేమ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణముక్కుల మల్లేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

స్వీపర్ల సమ్మెపై ప్రభుత్వం స్పందించాలి

పాతమంచిర్యాల: స్వీపర్ల సమ్మెపై ప్రభుత్వం స్పందించాలని పాఠశాలల స్వీపర్ల యూనియన్ నాయకులు అన్నారు. వేతనాలు పెంచాలనే డిమాండ్‌తో జెడ్పీ కార్యాలయం ఎదుట స్వీపర్లు చేస్తున్న రిలే నిరాహారదీక్ష 10వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ఐబీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాలల స్వీపర్‌యూనియన్ నాయకులు రమేష్, నారాయణ, వెంకటేష్, గంగన్న, పద్మ, లింగయ్య, కొమురయ్య, సత్తయ్య, గంగమ్మ, రాజమ్మ, పాఠశాలల స్వీపర్ల యూనియన్ గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్ ఉన్నారు.

బీడీ వర్కర్లకు జీవన భృతి చెల్లించాలి

పాతమంచిర్యాల: రాష్ట్ర క్యాబినెట్ ప్రకటించినట్లుగా బీడీ కార్మికులకు, కమీషన్ ఏజెంట్లకు జీవన భృతి చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్ నాయకురాలు ఎం.జ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బీడీ పరిశ్రమలల్లో పనిచేసే కార్మికులకు ఎలాంటి వయస్సు నిభందన లేకుండా, జీవనభృతి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్ సభ్యులు అరుణ, శ్రీనివాస్, తిరుపతి, మేఘన, శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్రీడాస్థలం కోసం వినతి

భీమారం: మండల కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణానికి స్థలం తక్కువగా ఉందని, మరికొంత స్థలం కేటాయించాలని స్థానిక యువత మంగళవారం తహసీల్దార్ వాసంతికి వినతిపత్రం ఇచ్చారు. ఈ మేరకు వెంటనే ఆమె స్పందించి సర్వేయర్‌ను అక్కడికి పంపించారు. భూమిని సర్వే చేసి తగిన వివరాలు ఇవ్వాలని ఆదేశించారు.

ఓటును వినియోగించుకోవాలి

నెన్నెల: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు చూడాలని తహసీల్దార్ భూమేశ్వర్ అన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల మండల స్థాయి నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలోని 22పోలింగ్ బూత్‌లకు సంబంధించిన వివిధ పార్టీల ఏజెంట్ల పేర్లను ముందస్తుగానే ఆయా పార్టీల నాయకుల నుంచి రాతపూర్వకంగా స్వీకరించారు. సమావేశంలో సాగర్‌గౌడ్, దాగం రమేష్, మల్లేష్, శైలేందర్‌సింగ్, ఆర్ఐ గణేష్ పాల్గొన్నారు.

కొత్త రోడ్డు.. పాత సమస్యలు



భీమిని: కన్నెపల్లి మండలంలోని నాయకునిపేట గ్రామపంచాయతీ పరిధిలోని కుర్మగూడం రోడ్డు నూతనంగా నిర్మించినప్పటికీ పాత సమస్యలే రాజ్యమేలుతున్నాయి. కుర్మగూడం గ్రామానికి రెండు నెలల క్రితం రూ.50లక్షలతో మెటల్ రోడ్డు మంజూరు కాగా, గుత్తేదారు మెటల్ రోడ్డు వేసి దానిపై నాసిరకమైన మట్టిని పోయడంతో కురుస్తున్న వర్షాలకు బురదమయంగా మారడంతో కుర్మగూడం ప్ర జలు ఇబ్బందులు పడుతున్నారు. రూ.50లక్షల వ్యయంతో వేసిన ఈ మెటల్ రోడ్డుతో, తమ సమస్యలు తీరుతాయని కుర్మగూడం గ్రామస్తులు సంబురపడ్డప్పటికీ ఆశలు ఆవిరైపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పక్కాగా రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వాహన తనిఖీలు

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): హాజీపూర్ మండలంలో ఎస్సై నరేశ్‌కుమార్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. వాహన ధృవీకరణ పత్రాలు పరిశీలించారు. పెండింగ్ చలాన్లు కట్టించారు. ఎస్సై నరేశ్‌కుమార్‌తో పాటు పోలీస్‌సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.